
సోసైటీ లేడీ
శ్రీమతి వాసిరెడ్డి కాశీరత్నం

వంంమలో తడిపిన మల్లె పూవులా వుందామె. కాదు. కాదు. భీముడు ద్రౌపదికి కానుకగా సమర్పించిన సౌగంధిక పుష్పంలా వుందామె. ఆమె శరీరంనుండి ఏదోఒకవిధమైన సుగంధం తీయగా హాయిగా నాసికాపుటాలకు సోకుతున్నది. తుమ్మెద రెక్కలాగావున్న కురులను అందంగా కూర్చి ముడి పెట్టింది. ఆ ముడి చుట్టటానికి ఎన్ని గంటలు తీసుకున్నదో! ఆ ముడిమీద ఒకేఒక్క గులాబీపూవు గుచ్చింది.

సభలో అందరూ ఆమెవైపే దూరంగానే కూర్చున్నారు. మగవాళ్ళుమాత్రం ఆమెచుట్టూ చేరిపోయారు.

ఆమె మూతి చాలా చిన్నదై, సున్నాలాగా కనిపిస్తున్నది. ఆ మూతి తెరిచి ఆమె ఏదో మాట్లాడుతున్నది వాళ్ళందరికీ చెవులలో అమృతం పోస్తున్నట్లుగా వున్నది.

ఆ నాటి సభకు కార్యకర్తగా వుండటం తన అదృష్టమనుకున్నాడు రాజా.

గోల్డ్‌స్పాట్ సీసా ఒక్క బిగువున కార్క్ పూడబెరికాడు. ఆమె చుట్టూ వున్నవాళ్ళను తోసుకుని ఆమెదగ్గరకు వెళ్ళాడు. ఆమె అందంగా ఆ బాటిల్ పుచ్చుకుంది. సీసామీద ఆమె చేతివేళ్ళు సున్నితంగా కదులుతున్నాయి. వేలి కున్న ముత్యం తళతళలాడుతున్నది.

ఎవరో ఆమెకు రాజాను పరిచయం చేశారు.

"వరదరాజా యువసాహితీ సమితిలో మెంబరు. ఇవ్వాళ్టి సభకు కార్యకర్త"

"ఇవ్ గ్లాడ్ టూ మీట్ యూ."

అతనివైపు ప్రశంసగా చూస్తూ అన్నది. రాజా ఒక్కసారి పొంగి పోయ్యాడు. అతని శరీరంలో రక్తం ఒక్కసారిగా పరుగులు తీసింది. గుండెలు గబగబా కొట్టుకున్నాయి.

ఆమె మెల్లిగా 'సిప్' చేస్తున్నది. రాజు అక్కడే నిలబడి ఆమెతో ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడాలని అని పిస్తున్నది. కాని అతని కింకా చాలా పనులున్నాయి.

అతని తనపనంతా తనమీదకు నెట్టి ఆమె సాన్నిధ్యంలో గడిపే ఏర్పాట్లు చేసుకున్నట్లనిపించింది.

పని చేస్తూనే రాజు ఆమె మాటలు వినటానికి ప్రయత్నించాడు.

ఆమె అచ్చగా ఇంగ్లీషు రచయితలను గురించి మాట్లాడుతున్నది?

హెమింగ్వే, లారెన్స్. షా, మామ్. షేక్స్పియర్లతోసహా సంభాషణ కుప్పి గంతులు వేస్తున్నది.

ఆమెకు అందమే కాదు వాక్చాతుర్యం కూడా ఉన్నది. సాహిత్య జ్ఞానమూ ఉన్నది.

మరికాసేపట్లోనే ఆమె వుపన్యాసం కూడా ప్రారంభమయింది. తెలుగులో ప్రాచీన సాహిత్యాన్ని గురించీ, ఆధునిక సాహిత్యాన్ని గురించి మాట్లాడుతున్నది. హాస్యమూ, శ్లేషారసోత్పత్తీ, కవిత ప్రతిభా అన్నిటిని గురించి కూలంకషంగా మాట్లాడుతున్నది;

కాని రాజు ముఖ్యంగా ఆమె మొహంవైపే చూస్తున్నాడు.

అంతగా మెరిసిపోయే అందాన్ని అతనెప్పుడూ చూడలేదు.

శరీరమంతా తళతళ లాడుతున్నది, గుబ్బల్లో గులాబీలు పూస్తున్నాయి.

ఆమె వయస్సెంత? పాతికా? ముప్పయ్యా? ఇంకా ఎక్కువా? అర్థం కావటంలేదు. అంత నాజూకుగా అలంకరించుకున్న దామె. అసలు ఏం తింటున్నది? ఏం తాగుతున్నది? అంత అందం ఎలా వచ్చింది.

సభ ముగిసి వెళ్ళటోయే ముందు మళ్ళీ అందరితోనూ మాట్లాడిం దామె వెళ్దామని అనుకుని లేచికూడా ఆమె చుట్టూ మూగి వాళ్ళుకూడా మాట్లాడుతూనే వున్నారు.

చిట్టచివరకు విధిలేక వాళ్ల ఆమెను కారెక్కించారు.

కారు సాగుతుంటే చిరునవ్వులు రువ్వుతూ చేయి వూపిందామె.

ఆ కారు దాటిపోగానే ఏదో పోగొట్టుకున్నట్లు డీలా పడిపోయారు వాళ్ళు.

ఇంటికి వచ్చినా రాజాకు మూడ్ వదలలేదు. అతనికి ఇల్లంతా ఇరుగ్గా అసహ్యంగా కనిపించింది. భార్య మాట లాడుతుంటే అతనికి విసుగేసింది. భార్యమూతి చాలా పెద్దదిగా వున్నదని, ఆ రోజే పరీక్షగా చూశాడు.

వూరికే తన్ను విసిగించవద్దని కసురుకున్నాడు. ఏం జరిగిందో తెలియక అతనిభార్య చిన్నపుచ్చుకున్నది.

ప్రక్కింటి మిత్రుడు మూర్తి చెపితే తెలిసింది, ఆమె ఆ వూళ్లోకల్లా పెద్ద బిజినెస్‌మాన్ భార్య. ఆమెకు సాహిత్యమంటే చాలా ఆసక్తి వున్నదట, రాజా కీయాలూ కొట్టిన పిండి. తరచు సభల్లో కనిపిస్తూ వుంటుందట.

మళ్ళీ రెండు మూడు సభల్లో ఆమె రాజాకు కనిపించింది. నమస్కారాలు పెట్టాడు. ఆమె తీయగా ఏదో మాట్లాడింది. అతను మైమరచిపోయాడు.

ఆమె పేరేమిటో అతనికి సరిగా గుర్తురాదు, రాజ్యలక్ష్మి దేవియో, రామలక్ష్మీ దేవియో కావచ్చు. అతను మాత్రం ఆమెకు దేవ పారిజాతమనీ

కల్హారమాలయనీ. కలాభాషిణి యనీ పేర్లు పెట్టుకున్నాడు.

* * *

మళ్లీ వాళ్ళతో బంధువుల వివాహంలో అతనికి కల్హారమాల కనిపించింది. రాజుకి చాలా సంతోషం కలిగింది. పెళ్ళివారు రాజుభార్యకు దూరపు బంధువులు. బాగా సంపాదించినవాళ్లు. షామియానాలూ, లైట్లు దగద్ధాయమానంగా వెలిగిపోతున్నాయి. ఆ పెళ్ళివారి కామె స్నేహమో పరిచయమో.

ఆమె కొద్దిగా నగలు అలంకరించుకున్నది. ఆ నగలవల్ల ఆమెకో అందం వచ్చిందో లేక ఆమెవల్లనే నగలకు అందం వచ్చిందో అర్థం కాలేదు.

రాజు ప్రతినమస్కారం పెట్టగానే ఆమె తీయగా నవ్వింది. రాజునీ రాజుభార్యనీ పలకరించింది. సుతారంగా వాళ్ళ చిట్టిబాబు బుగ్గమీద చిటికె వేసింది.

రాజుభార్య ఆమెదగ్గర కూర్చుని ఏవో కబుర్లు చెపుతున్నది.

రాజు చిత్రంగా చూశాడు. ఆడవాళ్లింతలో పరిచయాలు పెంచుకుంటారు! అంత చదువుకున్న ఆమె తన భార్యతో ఏం కబుర్లు చెపుతున్నదో.

అలా చూస్తూ తన భార్యనూ కల్హారమాలనూ పోలుస్తున్నాడు రాజు.

రాజుభార్య సుమిత్ర బొత్తిగాపాతకాలపు పట్టుచీర ఒకటి అస్తవ్యస్తంగా చుట్టబెట్టుతున్నది. జాకెట్టుకూ చీరకూ ఎంతమాత్రం మాచికాదు. పలకలాంటి జడఒకటి వేసి దానినే పట్టలాగా చుట్టుకున్నది. అసలదే వికారంగా వుంటే ఆ పైన దానిమీద రంగు రంగుల పూలన్నీ కలిపి కట్టపెట్టుకున్నది. ఆ పూలు సగం కిందకు వేళ్ళాడుతున్నాయి.

బొత్తిగా పొందికలేని మనిషి. తన శరీరం ఎలా వుందో బొత్తిగా పట్టించుకోదు.

రాజు మనస్సులోనే భార్యమీద విసుక్కున్నాడు.

అతనొకసారి బయటికి వెళ్ళి సిగరెట్టు కాల్చి మళ్ళీ లోపలికొచ్చాడు. అతనికి లోపలా బయటా కూడా కాలు నిలవటం లేదు. బయటికివెళ్తే ఆమెను చూడాలనిపిస్తున్నది. అలా అని లోపలికొస్తే ఆమెదగ్గర కూర్చున్న భార్యను చూడలేక పోతున్నాడు.

రాజుభార్య సుమిత్ర రవిక విప్పి పిల్లవాడికి పాలిస్తున్నది. రవికలోపల తొడుక్కున్న బాడీ మాసిపోయివున్నది. ఆ మురికిబాడీ స్పష్టంగా కనిపిస్తున్నది. వీపుమీద ఆ బాడీ జాకెట్టుకన్నా బెత్తెడు ఎక్కువగా వున్నది.

పిల్లవాడికి పాలిస్తూ పెళ్ళింట్లో పనివాళ్ళకేదో పురమాయిస్తున్నది. దగ్గరున్న సామాను అందుకోటానికి అలాగే అటూ ఇటూ జరుగుతున్నది.

ఆ దృశ్యం అలా చూస్తుంటే రాజుకు వొళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లుగా వున్నది. తన భార్యను చూసి ఆవిడేమనుకుంటున్నదో? అలాంటి భార్యను కట్టుకున్నందుకు నవ్వుకుంటున్నదా?

సంధ్యలో అతని అంతరాత్మ పెద్ద గోల పెట్టేసింది!

ఆవిడకు మాత్రం పిల్లా జల్లా వుంటారా? సంసారం చెయ్యటల్లా!

పిల్లలా? ఆవిడకా? పిల్లలు పుడితే అలా షోకేస్‌లో బొమ్మలా ఎలా వుంటుంది!

కల్హారమాలను చూస్తున్నంత సేపు ఉక్కిరిబిక్కిరై పోయాడు.

ఇదివరకటిలాగా ఆమెతో మాట్లాడలేకపోయాడు. భార్యను చూపినపుడల్లా అతనితల వొంగిపోతున్నది.

ఆ తరువాతకూడా సభల్లో సమావేశాల్లో ఎక్కడకనపడ్డా రాజు ఆమెతో మాట్లాడలేక పోయాడు. సిగ్గుతో ముడుచుకుపోయేవాడు.

ఆమె తనభార్యను గురించి ఎంత నవ్వుకుంటున్నదో. ఈ భావం అతనిని విడవటం లేదు.

* * *

ఆరోజు పక్కింటి మూర్తి ఎందుకో పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతనిచేతిలో ఆ రోజువచ్చిన పేపరు వున్నది.

"ఒరేయి రాజూ. పేపరు చూశావా? ఈ సొసైటీ లేడీస్ చాలా ప్రమాదకరమైనవాళ్ళంటే వొప్పుకున్నావా?"

రాజు కేమీ అర్థంకాలేదు. ప్రశ్నార్థకంగా చూశాడు.

"అదే మీ రాజ్యలక్ష్మీ దేవిలేదూ!"

"మా రాజ్యలక్ష్మీదేవా?"

"మరీ, నువ్వు మురిసి చస్తున్నావు కదుట్రా. చక్కనిదీ, సాహిత్యాభిలాష కలదనీ వాక్చాతుర్యం మెండుగా వున్నదనీ. ఆ మహాతల్లేనయ్యా. సత్యనారాయణ హత్య కేసులో ఈవిడకూడా వుందట పేపరులో ఆ వివరా లన్నీ లేవనుకో.

ఈ సత్యనారాయణా ఈవిడా ఇంకా కొంతమంది కలిసి దొంగనోట్లు తయారు చేశారుట. మొత్తంమీద ఏదో తగువొచ్చి ఈ సత్యనారాయణని కాస్తా చంపేశారుట. ఇప్పుడీ కేసు మాఫ్ చేసుకోవటానికి డబ్బుకూడా గుప్పిస్తారేమోలే. ఇదిరా నాయనా కథ. జైలు తప్పదంటున్నారు లే."

రాజు పేపరు చూస్తూ అలాగే నిర్విణ్ణుడై పోయాడు.

ఏదో కొండ శిఖరం మీద నుండి అగాధంలోకి తోసినట్టయింది. తాను అంతగా అభిమానించి పరవశమైపోయిన కల్హార మాలయేనా ఈమె? ఆవిడ అసలు స్వరూపం ఇదా ఓరి భగవంతుడా?

పక్కింటి మూర్తితో ఇంకేమీ మాట్లాడలేకపోయాడు రాజు. ఆ పేపరు పుచ్చుకుని భార్యతో చెప్పుదామని వంటింటి వైపు నడిచాడు. అక్కడ పిల్లవాడు పాలు వొలకపోస్తే అదంతా శుభ్రం చేస్తున్నది సుమిత్ర.

ఆమె జుట్టంతా రేగిపోయింది. మొహమంతా చెమట పోసింది చీర కుచ్చెళ్ళు పాలలో పడకుండా పైకి దోపుకున్నది ఆ కాళ్ళు సగం సగం కనిపిస్తున్నాయి. తడిలో ఎక్కువగా తిరగటం వలన అరికాళ్ళు పగుళ్లు చూపాయి.

రాజు ఆమెను చూస్తూ అలాగే నిలబడిపోయాడు. సుమిత్ర ఇప్పుడతనికి అసహ్యంగా కనపడటం లేదు. అమాయకంగా మూర్తీభవించిన స్త్రీమూర్తిలాగా మాతృదేవతలాగా కనిపిస్తున్నది.

తెలివితేటలు అధికమై తన ఈ భార్య అందరినీ మోసగించదు. గూఢపుఠాణీలూ, హత్యలూ చేసి జైళ్ళపాలవదు. బాటిల్స్ తెప్పించుకుని రహస్యంగా తాగదు.

మగవాళ్ళను ఆకర్షించటానికి కృత్రిమంగా వయస్సు కనపడకుండా అలంకరించుకోదు. అచ్చమైన ఆంధ్రుల ఆడపడుచు ఈమె తనలాంటి సగటుమనిషి గర్వించదగ్గ భార్య ఈమె.

రాజుకు చాలా సంతోషంగా ఉంది. అతను వ్యామోహం నుండి బయటపడ్డాడు.

చాలారోజులనుండీ అతను భార్యను తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇవ్వాళ కరువుతీరా ఇంట్లో కూర్చొని భార్యతో కబుర్లు చెప్పాలనుకున్నాడు.

★


ఎంతో కాలంగా ఎదురుజూస్తున్న

శ్రీమతి యలమంచిలి ఝాన్సీలక్ష్మి రచనలు

| | | |
|---|---|---|
| మనుషులూ-మమతలూ | ఆంధ్రపత్రిక సీరియల్ | 5.00 |
| వెలుగునీడలు | " " | 6.00 |
| అనూరాధ | " " | 5.00 |
| రాగమయి | " " | 3.50 |
| జీవనవలయం - శ్రీమతి సరస్వతీ బాబూరావు | ఆంధ్రప్రభ సీరియల్ | 3.00 |

అందరి మెప్పు పొందిన

శ్రీ ఆదివిష్ణు రచనలు

| | | |
|---|---|---|
| సగటుమనిషి | ఆంధ్రప్రభ సీరియల్ | 5.00 |
| స్నేహం | ఆంధ్రజ్యోతి " | 4.00 |
| ఉద్యోగం | కథలు-వివిధ పత్రికలనుండి | 3.50 |
| కలెక్టరు రక్షించు | " | 3.00 |
| పరివృతం | కథ- ఆంధ్రపత్రిక సీరియల్ | 2.50 |

శ్రీ పి యస్ నారాయణ రచనలు

| | | |
|---|---|---|
| మేఘమాల | ఆంధ్రపత్రిక సీరియల్ | 5.00 |
| రాగస్రవంతి | కథలు-వివిధ పత్రికలనుండి | 3.00 |
| ముగింపు | రెండు నవలికలు | 3.00 |
| జ్యోతి (నవల) | యమ్. రామకోటి | 5.00 |
| ప్రాణాఘలం (నవల) | విభావసు | 5.00 |
| ఆంధ్రప్రదేశ్ రాజకీయపరిణామ చరిత్ర | ఎన్. ఇన్నయ్య | 2.50 |

పూర్తి కేటలాగు "ఉచితం" నేడే వ్రాయండి!

పుస్తకప్రియులకు గ్రంథాలయాధిపతులకు శుభవార్త

నవజ్యోతి పబ్లికేషన్సు

విశ్వ విఖ్యాత రచయిత

శ్రీ గోపీచంద్ గారి రచనలు

| | | |
|---|---|---|
| మెరుపుల మరకలు | నవల | 3.00 |
| భార్యల్లోనే వుంది | కథలు | 2.00 |
| దేశం ఏమయ్యేట్టు? | " | 2.00 |
| గీతా పారాయణం | " | 2.00 |
| తండ్రులూ-కొడుకులూ | " | 2.00 |
| ధర్మాసుపత్రి | " | 2.00 |
| ఇరుగూ-పొరుగూ | " | 2.00 |
| సరే కానివ్వండి | " | 2.00 |
| దేవుని జీవితం | " | 2.00 |
| పాతపగలూ-కొత్తవగలూ | " | 2.00 |
| మాకూ వున్నాయి స్వగతాలు | " | 2.00 |
| కూపస్థమండూకం | " | 2.00 |
| జనానా | " | 2.00 |
| గోపీచంద్ కథలు | 1వ భాగము | 10.00 |
| గోపీచంద్ కథలు | 2వ " | 10.00 |
| గోపీచంద్ కథలు | 3వ " | 10.00 |

ప్రతి ఒక్కరూ చదువ వలసిన

శ్రీమతి శిఖా (గంటి) వెంకటరమణ రాజా రచనలు

| | | |
|---|---|---|
| అడకత్తెరలో మనిషి | ఆంధ్రపత్రిక సీరియల్ | 4.50 |
| మొగలిపొదలు | " " | 5.00 |
| పరిలిప్తం | " " | 6.00 |
| అనురాగాల హద్దులు | | 5.00 |
| చివరిమజిలీ | | 2.50 |
| గాజుబొమ్మలు | | 3.00 |
| నీటిముత్యాలు | | 3.00 |
| వేయబోవని తలుపు | ఆంధ్రజ్యోతి సీరియల్ - శ్రీమతి తురగా జానకీరాణి | 4.00 |
| సమాంతర రేఖలు | ఆంధ్రప్రభ సీరియల్ శ్రీ పసుపులేటి మల్లిఖార్జునరావు | 8.00 |
| రాగసుధ | శ్రీ జి. సుధాకర్ రచన | 6.00 |

శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు రచనలు

| | | |
|---|---|---|
| ఇది త్యాగం కాదు | నవల | 4.00 |
| వ్యక్తిత్వాలు | " | 4.00 |

శ్రీ నటరాజ రామకృష్ణ రచనలు

| | | |
|---|---|---|
| రదనిక | నవల | 3.00 |
| మాఇంకో అమ్మకథ | ఆంధ్రజ్యోతి సీరియల్ | 2.50 |
| మహాత్యాగి | శ్రీ టి. బి. యం. అయ్యవారు | 4.00 |
| రాజసోదరి | " | 4.00 |

నవజ్యోతి పబ్లికేషన్సు
కాళేశ్వరరావు రోడ్ ✳ విజయవాడ-2.